గూడు కోసం గోడు

- గుడిసెల్లోనే మగ్గుతున్న బతుకులు
- వర్షాలు వస్తే తప్పని తిప్పలు
- ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూపు



కవర్లు కప్పిన గుడిసె



నెన్నెలలో ఓ పూరి గుడిసె

నెన్నెల: ప్రభుత్వాలు మారిన పాలకులు మారిన పేదోడి పరిస్థితి మారడం లేదు. రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు. గత 20 ఏళ్లుగా శిథిలమవుతున్న గుడిసెల్లోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు కూలుతాయో తెలియదు. వాన వస్తే నీరు దారలై పారుతుంది. గట్టి గాలి వానకు పైకప్పు ఉంటుందో ఊడిపోతుందో తెలియదు. బిక్కుబిక్కుమంటూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని గడపాల్సిన పరిస్థితి. సొంత ఇంటి నిర్మాణం కలగానే మిగులుతోంది. అదిగో ఇందిరమ్మ ఇళ్లు, ఇదిగో సర్వేలు అనడమే తప్పా ఆచరణలో అమలు కావడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అదిగో డబుల్ బెడ్రూం, ఇదిగో ఇళ్లు అని ఆశ చూపి చివరికి నిరాశే మిగిల్చారు. ఇళ్లు ఇస్తామని ప్రభుత్వాలు చెప్పడం తప్పా ఆచరణలో అమలు కావడం లేదు. వర్షాలకు గోడలు తడిసి అవి ఎప్పుడు కూలుతాయోనని భయాందోళన మధ్య జీవనం గడుపుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో పేదల కన్నీటి గోడు ఇది.

తప్పని ఎదురుచూపు

గ్రామాల్లో పూరి గుడిసెల్లో, చిన్న చిన్న పెంకు టిళ్లల్లో ఇంటిపై కవర్లు కప్పుకొని నివసిస్తున్న జనం వందల సంఖ్యలో ఉన్నారు. వారికి పక్కా ఇళ్లు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నెన్నెల, జంగాల్‌పేట, ఖర్జీ, దమ్మిరెడ్డిపేట, కోణంపేట, మైలారం, కొత్తూర్, ఇత్తాపూర్ గ్రామాల్లో నివసిస్తున్న పేదల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు వస్తే తమ సమస్య తీరుతాయని ఎదురుచూస్తున్నారు. ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని పేదలు కోరుతున్నారు.

పట్టించుకునే వారేరి?

ఏళ్ల నుంచి మాపై రాజకీయ నాయకులకు చిన్న చూపే. ఓట్ల కోసం, సమావేశాలు, సభల కోసం మేము పనికి వస్తాం. మా అవసరాలు మాత్రం పట్టించుకునే నాథుడే లేరని పేదలు వాపోతున్నారు. మండలంలోని గూడు లేని గుడిసెలు, పక్కా ఇళ్లు లేని తాటి, ఈతకమ్మలతోపాటు వరిగడ్డి గుడిసెలు, కవర్లు కప్పుకొని నిర్మించుకొని ఎండ, వాన చలికి తలదాచుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పట్టించుకుని ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తారని ఎదురుచూస్తున్నారు.

భయంతో గడుపుతున్నాం



వర్షానికి, చలికి, ఎండకు తట్టుకుంటూ చిన్న గుడిసెలో బతుకుతున్నాం. గాలి దుమారం వస్తే ఎప్పుడు కూలి మీదపడుతుందోనని భయమేస్తుంది. పిల్లలతో గుడిసెలో గడపడం కష్టంగా ఉంది. కాంగ్రెస్ సర్కారు మా లాంటోళ్లకు ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి.

– అబ్బూర్ల భీమక్క, నెన్నెల

ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలి



మేము కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాం. గుడిసె మీద కవర్లు కప్పుకొని ఉంటున్నాం. పిల్లలు, మేము గుడిసెలో మెలగడం ఇబ్బంది అవుతుంది. ఎన్నోసార్లు ఇబ్బంది కోసం దరఖాస్తు చేసుకున్న ఇళ్లు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి.

– బండి మల్లిక, నెన్నెల

క్లుప్తంగా

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సైన్స్ కోఆర్డినేటర్లు

కోటపల్లి: జిల్లా సైన్స్ సెంటర్ ఆధ్వర్యంలో జిజ్ఞాస సంచార ప్రయోగశాల నేతృత్వంలో కోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రయోగాల నిర్వహణ, జీవశాస్త్రంపై గురువారం సైన్స్ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, సంపత్ వివరించారు. జీవశాస్త్రంలో మానవ మెదడు పనితీరు, ఇతర అవయవాల పనితీరుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ట్రాక్టర్లు

జన్నారం: ఇందన్‌పల్లి అటవీ రేంజ్ పరిధిలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ సీజ్ చేశారు. గురువారం అర్ధరాత్రి ఇసుక తరలిస్తున్నారనే సమాచారంతో తనిఖీ చేయగా మొర్రిగూడ వాగులో ఇసుక నింపుతున్న ఒక ట్రాక్టర్, కలమడుగు నుంచి ధర్మారం వైపు వెళ్తున్న మరో ట్రాక్టర్‌ను పట్టుకుని రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు. ఆయన వెంట సెక్షన్ అధికారి రవి, బీట్ అధికారి ముజీబొద్దీన్ ఉన్నారు.

అర్ధరాత్రి వేళ.. రక్త నమూనాల సేకరణ



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

దండేపల్లి: సాధారణంగా అన్నిరకాల వ్యాధులకు ఏ సమయంలోనైనా రక్త పరీక్షలు నిర్వహిస్తారు. బోదకాలు వ్యాధికి మాత్రం రాత్రివేళలో రక్తనమూనాలు సేకరిస్తే వ్యాధి నిర్ధారణ సులభతరమవుతుంది. దండేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మండలంలోని వెల్గనూర్‌లో గురువారం రాత్రి 10 నుంచి శుక్రవారం తెల్లవారుజాము 1 గంట వరకు సిబ్బంది ఇంటింటా తిరిగి 311 మంది నుంచి రక్తనమూనాలు సేకరించారు. వైద్యుడు సతీశ్, పారా మెడికల్ సిబ్బంది, జిల్లా, జోనల్ అధికారులు పాల్గొన్నారు.

బీసీ రాజ్యాధికార సమితి నియోజకవర్గ ఇన్‌చార్జిగా గణేశ్



గణేశ్

జైపూర్: బీసీ రాజ్యాధికార సమితి చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా శివ్వారం తాజామాజీ సర్పంచ్ ఆవిడపు గణేశ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం బీసీ రాజ్యాధికార సమితి జిల్లా కన్వీనర్ మనోహర్ ప్రకటించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన కన్వీనర్, నాయకులకు గణేశ్ కృతజ్ఞతలు తెలిపారు.

23న సింగరేణి ఆవిర్భావ వేడుకలు

శ్రీరాంపూర్: ఈనెల 23న సింగరేణి ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రగతి మైదానంలో వేడుకలు ఉంటాయని పేర్కొన్నారు. వేడుకల్లో భాగంగా కంపెనీ ఔన్నత్యం తెలిపే స్టాళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తినుబండారాల స్టాల్స్ ఏర్పాటు చేయాలనుకునే వారు ఈనెల 18 సాయంత్రం 6 గంటల్లోగా శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని పర్సనల్ డిపార్టుమెంట్‌లో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

18న ఆటల పోటీలు

మందమర్రిరూరల్: సింగరేణి డే పురస్కరించుకుని ఏరియాలోని సీఈఆర్ క్లబ్ ఆవరణలో సింగరేణి సేవా సమితి ఆధ్వర్యాన మహిళలకు ఈనెల 18న ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఏరియా పర్సనల్ మేనేజర్ (పీఎం) శ్యాంసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. అదేరోజుసాయంత్రం దీపాలంకరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పోటీలో పాల్గొనాలనే మహిళలు సెల్ 70133 59316 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. 20న పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఉత్తమ గృహాల ఎంపిక ఉంటుందని, ఈ పోటీలో పాల్గొనేవారు సెల్ 93917 91054 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు. విజేతలకు 23న సింగరేణి డే సందర్భంగా బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు వినతి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటులో నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం హాజీపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామారెడ్డి జిల్లాలో బీసీ డిక్లరేషన్ సభలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎంబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిందని, ఇప్పటికైన అసెంబ్లీ సమావేశాల్లో ఏర్పాటు చేసేలా ప్రకటన చేయాలని కోరారు. లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు అక్కల రమేశ్, శాఖపూరి భీమ్‌సేన్, వేణుగోపాల్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సన్మానం



ఉత్తమరైతుకు జ్ఞాపిక అందిస్తున్న ఎమ్మెల్సీ

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం పరిధిలో పంటల సాగులో రాణిస్తున్న ఇద్దరు రైతులను సన్మానించారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ డైమండ్ జూబ్లీ ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సాగులో ఉత్తమంగా రాణిస్తున్న బెల్లంపల్లి మండలం దుబ్బపల్లి గ్రామానికి చెందిన ఆగిడి స్వామి, కెరమెరి మండలం ధనో రా గ్రామానికి చెందిన కెంద్రే బాలాజీని ఉత్తమ రైతులుగా ఎంపిక చేశారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ శాలువాతో సత్కరించి మెమెంటో అందజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ, శాస్త్రవేత్తలు నాగరాజు, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీ తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్

చెన్నూర్‌రూరల్: అంగ్రాజ్‌పల్లి పీహెచ్‌సీని శుక్రవారం స్టేట్ అబ్జర్వర్ డాక్టర్ సాగర్ తనిఖీ చేశారు. కుష్ఠు వ్యాధి సర్వే రికారులు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామాల్లో కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. డీపీఎంవో రాఘవయ్య, వైద్యులు సత్యనారాయణ, స్పందన, సీహెచ్‌వో వెంకటేశ్వర్, సబ్ యూనిట్ అధికారి జగదీశ్ ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

చెన్నూర్: నిరుద్యోగ యువత క్రమశిక్షణ పట్టుదలతో చదువుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి అన్నారు. వీఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెన్నూర్ గ్రంథాలయంలో నిరుద్యోగ యువకులకు శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలో మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ట్రస్మా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేంద్రఫణి, జిల్లా అధ్యక్షుడు దేవన్న పాల్గొన్నారు.

కోతుల దాడిలో షెడ్డు ధ్వంసం

శ్రీరాంపూర్: సింగరేణి కాలనీలో కోతుల బెడద అధికమైంది. గురువారం రాత్రి నస్పూర్ నాగార్జున కాలనీలో 3327 క్వార్టర్ ముందు ఉన్న రేకుల షెడ్డు కోతుల దాడిలో ధ్వంసమైంది. ఇందులో అజయ్ అనే ఉద్యోగి నివాసం ఉంటున్నారు. రేకుల షెడ్డుపై కోతులు గుంపుగా వచ్చి ఎగిరి దూకడంతో కూలింది. షెడ్డు గోడ కొంత భాగం కూలింది. ప్రమాద సమయంలో ఇంట్లోవారు వెనుకాల ఉండటంతో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ఆర్పీల అరెస్టు

చెన్నూర్: ఏడు నెలలు వేతనాలు చెల్లించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆర్పీలను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. మున్సిపల్ రిసోర్స్ పర్సన్లు తలారి భూమక్క, రజిత, రేణుక, రాజేశ్వరి మాట్లాడుతూ అరెస్టు చేయడం అన్యాయమన్నారు. ఆర్పీలు శంకరమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

వేమనపల్లి: మండలంలోని కేతన్‌పల్లి గ్రామానికి చెందిన పెరగాని అనూష (23) ఏడాదిన్నర వయస్సు ఉన్న కొడుకు సుశాంత్‌తో ఇంటి నుంచి అదృశ్యమైనట్లు ఎస్సై శ్యాంపటేల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 28న అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

జైపూర్: మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతిబాపురావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న రూఫ్ రైన్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ పరిశీలించి సూచనలు చేశారు. ఏఈ హౌజింగ్ లయక్ అలీ, పంచాయతీ కార్యదర్శి బి.ఉదయ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ మల్లేశ్, టీఏ శృతి ఉన్నారు.

16న దీపాలంకరణ పోటీలు

శ్రీరాంపూర్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు 16న దీపాలంకరణ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఓ ప్రకటనలో తెలిపారు. నస్పూర్ కాలనీలోని సేవ భవన్‌లో సాయంత్రం 5 గంటలకు, 17న సాయంత్రం 5 గంటలకు ప్రగతి మైదానంలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు నిర్ణీత ప్రదేశాలకు చేరుకొని పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఇందులో గెలుపొందిన వారికి 23న ప్రగతి మైదానంలో జరిగే వేడుకల్లో బహుమతులు అందించనున్నట్లు తెలిపారు.

మహిళలకు క్రీడా పోటీలు



టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న మహిళలు

శ్రీరాంపూర్: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు క్రీడాపోటీలు నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం శ్రీరాంపూర్ సీఈఆర్ క్లబ్‌లో, గురువారం రాత్రి నస్పూర్ కాలనీలోని సేవా భవన్‌లో వేర్వేరుగా పోటీలు జరిగాయి. బాంబ్ బ్లాస్ట్, టగ్ ఆఫ్ వార్, త్రోబాల్ తదితర పోటీలు నిర్వహించారు. ఉత్సాహంగా మహిళలు పాల్గొన్నారు. పిల్లలకు పరుగు పందెం పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి 23న ప్రగతి మైదానంలో జరిగే ఆవిర్భావ వేడుకల్లో బహుమతులు అందించనున్నట్లు అధికారులు తెలిపారు. స్పోర్ట్స్ కోఆర్డినేటర్ నరసయ్య, ఇండోర్ కెప్టెన్ తోట సురేశ్, సేవా సెక్రెటరీ కొట్టె జ్యోతి, సభ్యులు శారద, సునీత, రజిత పాల్గొన్నారు.

వెంకటాపూర్ మాజీ సర్పంచ్ మృతి



వెంకన్న (ఫైల్)

భీమిని: మండలంలోని వెంకటాపూర్ మాజీ సర్పంచ్ దారిశెట్టి వెంకన్న అనారోగ్యంతో మృతి చెందాడు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింగరావు, భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయలు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: వికారాబాద్ జిల్లా లగచర్లలో జరిగిన ఘటనలో సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతు హీర్యానాయక్ ఆస్పత్రికి తీసుకెళ్తుండగా బేడీలు వేయడాన్ని బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు ఖండించారు. దీనికి నిరసనగా మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు మాధవరపు వెంకటరమణ, గోపతి రాజయ్య, కృష్ణమూర్తి, స్వామిరెడ్డి, లక్ష్మణ్, హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్ఆర్పీ 1గనిలో రక్షణ పక్షోత్సవాలు



ఉద్యోగులకు బహుమతి అందిస్తున్న అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న సేఫ్టీ కమిటీ టీం మెంబర్లు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఎస్ఆర్పీ 1గనిలో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలు నిర్వహించారు. రక్షణ కమిటీ సభ్యులు శుక్రవారం గనిని తనిఖీ చేసి రక్షణ చర్యలను పరిశీలించారు. జీఎం (ఐ, పీఎం) బత్తుల శ్రీనివాస్‌రావు హాజరై రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. రక్షణతో పనిచేసిన పలువురు ఉద్యోగులకు బహుమతులు అందజేశారు. గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, గుర్తింపు సంఘం శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, గని మేనేజర్ విజయ్‌కుమార్, రక్షణ తనిఖీ కమిటీ సభ్యులు ఉమాకాంత్, జనార్దన్‌రెడ్డి, డేవిడ్, గని రక్షణ అధికారి రాజేశ్‌కుమార్, సంక్షేమ అధికారి సాధన్, ఏఐటీయూసీ నాయకులు కొమురయ్య, ఫిట్ సెక్రెటరీ దాడి రాజయ్య పాల్గొన్నారు.

ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వాములు కావాలి

మందమర్రిరూరల్: సింగరేణిలో ప్రతి ఉద్యోగి రక్షణలో భాగస్వాములు కావాలని సేఫ్టీ కమిటి కన్వీనర్ నారాయణరావు తెలిపారు. సింగరేణి 55వ రక్షణ పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం మందమర్రి ఏరియాలోని కేకే–ఓసీ గనిని రక్షణ కమిటీ మెంబర్స్ ఏరియా జీఎం దేవేందర్, సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ తనిఖీ చేశారు. ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తూ రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈసందర్భంగా కమ్యూనికేషన్ సెల్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షణపై లఘు నాటిక ఉద్యోగులను ఆకట్టుకుంది. ఏరియా అధికారులు, యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచుతాయి



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న ఆర్డీవో హరికృష్ణ

బెల్లంపల్లి: క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ పెంచుతాయని బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ అన్నారు. బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీఓఈ) విద్యాలయం క్రీడా ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్‌పోటీలను ఆయన హాజరై ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృఢత్వం కలుగుతుందన్నారు. ఆటల్లో గెలుపోటములు సహజమన్నారు. మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో మహేందర్, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాంచందర్, మాజీ ఎంపీపీ మల్లేశ్, మాజీ ఎంపీటీసీ మహేందర్, సీఓఈ ప్రిన్సిపాల్ డి.శ్రీధర్, హెచ్‌ఎంలు, పీఈటీలు పాల్గొన్నారు.

సింగరేణి భవిష్యత్ కోసం పాటుపడాలి



ప్రతిజ్ఞ చేయిస్తున్న కన్వీనర్ విజయ్‌ప్రసాద్

బెల్లంపల్లి: సింగరేణి భవిష్యత్ కోసం ఉద్యోగులు కలిసికట్టుగా పాటుపడాలని మల్టీ డిపార్ట్‌మెంటల్ కమిటీ కన్వీనర్, ఎస్ఓటు జీఎం విజయ్‌ప్రసాద్ అన్నారు. మందమర్రి ఏరియా శాంతిఖని గనిపై శుక్రవారం నిర్వహించిన మల్టీ డిపార్ట్‌మెంటల్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కంపెనీ భవిష్యత్ కోసం ప్రణాళిక బద్ధంగా పని చేయాలన్నారు. లక్ష్యానికి అనుగుణంగా ఉద్యోగులు వ్యవహరించాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తమ పనితనాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. సింగరేణి కంపెనీ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత లక్ష్యాలు, సాధించిన విజయాలు, భూగర్భ, ఓపెన్‌కాస్ట్ గనుల్లో యంత్రాల వినియోగం, సంక్షేమ కార్యక్రమాలు, ఆర్థిక అంశాలను ఉద్యోగులకు వివరించారు. అనంతరం వారితో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఏఐటీయూసీ కార్మిక సంఘం బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్, సీఎంఓఏఐ అధ్యక్షుడు నాగవర్ధన్, ఎస్కే గ్రూప్ ఏజెంట్ అబ్దుల్ ఖాదర్, డీజీఎం(ఐఈడీ) రాజన్న, డీజీఎం(ఎఫ్అండ్ఎ) ప్రసాద్, ఏరియా వర్క్‌షాప్ ఎస్ఈ కృష్ణారెడ్డి, పర్సనల్ మేనేజర్ ఎస్.శ్యాంసుందర్, డీవైపీఎం ఆసిఫ్, గని మేనేజర్ సంజయ్‌కుమార్ సిన్హా, గని రక్షణ అధికారి రాజు, సంక్షేమ అధికారి సత్యనారాయణ, ఏఐటీయూసీ గని ఫిట్ సెక్రెటరీ దాసరి తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

ఆదివాసీల భూముల జోలికి రావొద్దు

- సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి



ఆదివాసీలతో మాట్లాడుతున్న సంకె రవి

కాసిపేట: ఆదివాసీల బతుకులతో చెలగాటం ఆడుతూ భూముల నుంచి వెళ్లగొట్టే కుట్రలు మానుకోవాలని ఆదివాసీ భూముల జోలికి వస్తే పోరాటమేనని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. మండలంలోని కొత్త తిరుమలాపూర్ గ్రామానికి శుక్రవారం వెళ్లి ఆదివాసీ సమస్యలు తెలుసుకున్నారు. కార్పొరేట్ సంస్థల అధిపతుల సంపాదనకు ఆదివాసీలు భూములు, జీవనోపాధి కోల్పోవాలా అని ప్రశ్నించారు. దేవాపూర్ సిమెంట్ కంపెనీ మైనింగ్ విస్తరణ పేరుతో ఆదివాసీల భూములు, జీవితాలను పణంగా పెట్టుకోవాలనుకోవడం దారుణమన్నారు. 1991కి ముందు పాత తిరుమలాపూర్ నుంచి తీసుకువచ్చి ఇక్కడ అవాసం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వారు సాగు చేసుకుంటున్న భూములను ప్రభుత్వ భూములుగా చూపుతూ లాక్కొని అప్పజెప్పాలని చూస్తున్నారని తెలిపారు. వెంటనే నిర్ణయం మార్చుకోవాలని సూచించారు. ఆదివాసీల్లో అభద్రతాభావం తొలగేలా అధికారులు నిర్ణయం మార్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాయిరాల రాములు, టీకం శంకర్, ఆత్రం భీంబాయి, ఆదివాసీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ బూత్ కమిటీలు పూర్తిచేయాలి

చెన్నూర్: చెన్నూర్‌లో ఈనెల 16లోగా బీజేపీ బూత్ కమిటీలు త్వరగా పూర్తిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి భద్రం లింగారెడ్డి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో చెన్నూర్ నియోజకవర్గంతోపాటు వేమనపల్లి మండల సభ్యత్వ నమోదు జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అధ్యక్షతన శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు రజనీర్ జైన్, దుర్గం అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు రాపర్తి వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ

భీమిని: మండల కేంద్రంలో అయ్యప్ప పడిపూజను శుక్రవారం వైభవంగా నిర్వహించారు. గురుస్వామి సంగర్స్ రాజేశ్వరశర్మ, గంగా కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో అన్నపురం మహేందర్ గౌడ్ స్వామి నివాసంలో అయ్యప్ప స్వామికి అభిషేకాలు నిర్వహించారు. 18 మెట్లను పూలమాలలతో అలంకరించి అయ్యప్ప, కుమారస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ద్వితీయ మహాసభలు విజయవంతం చేయాలి

కాసిపేట: హైదరాబాద్‌లో జనవరి 5, 6, 7తేదీల్లో నిర్వహించే అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి(డీహెచ్‌పీఎస్) జిల్లా నిర్మాణ బాధ్యుడు దాగం మల్లేశ్ కోరారు. శుక్రవారం సోమగూడెంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితుల అభివృద్ధే లక్ష్యంగా నిర్వహించే మహాసభలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కామ్రేడ్ చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కడియం శ్రీహరి, వివేక్, రాష్ట్రాల ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. దళితులు అధికసంఖ్యలో తరలిరావాలని కోరారు. అంతకుముందు మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, జిల్లా కార్యదర్శి దేవి పోచన్న, నాయకులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.